## అభివృద్ధికి పెద్దపీట

**★ ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి**

■ రామచంద్రాపురం,అక్టోబర్6:రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నదని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో రూ.3.90కోట్లతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు మున్సిపల్ చైర్‌పర్సన్ లలితాసోమిరెడ్డితో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి, ప్రజా సంక్షేమం విషయంలో రాజీలేకుండా పనిచేస్తున్నదన్నారు. గతంలో ఎప్పుడూ జరుగని అభివృద్ధి బీఆర్‌ఎస్ హయాంలో జరిగిందన్నారు. పటాన్‌చెరు నియోజకవర్గంలోని గ్రామాలు, మున్సిపాలిటీలు, బల్దియా డివిజన్‌లు అభివృద్ధిలో దూసుకు పోతున్నాయని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలతో పేద ప్రజలు సంతోషంగా బతుకుతున్నారన్నారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ రాములుగౌడ్, కమిషనర్ శ్రీనివాస్, ఏఈ సంజయ్, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

## చట్టాలపై అవగాహన ఉండాలి

**★ జిల్లా న్యాయసేవాధికార కార్యదర్శి హన్మంతరావు**

■ సంగారెడ్డి, అక్టోబర్ 6 : విద్యార్థులు చట్టాలపై అవగాహన ఉండాలని, చదువుల్లో రాణిస్తూ ఉన్నత శిఖరాలను చేరుకోవాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి హన్మంతరావు సూచించారు. శుక్రవారం ఇస్మాయిల్‌ఖాన్‌పేట, సంగారెడ్డి ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ సమాజంలో మహిళలపై గృహహింస, వరకట్న వేధింపులు జరుగుతున్నాయన్నారు. మహిళలకు అండగా అనేక చట్టాలు రక్షణగా ఉన్నాయన్నారు. గృహహింస, వరకట్న నిషేధ, బాలకార్మిక వ్యతిరేక, పోక్సో చట్టాలను తెలుసుకోవాలన్నారు. ముందుగా న్యాయమూర్తి విద్యార్థులతో మాట్లాడి మధ్యాహ్న భోజనం గురించి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సత్తుగోండ సానె, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కమ్యూనిటీ భవనానికి శంకుస్థాపన

■ కోహీర్, అక్టోబర్ 6 : పట్టణంలోని సంజీవ్‌నగర్ కాలనీలో రూ.10లక్షలతో చేపట్టనున్న ఎస్సీ కమ్యూనిటీ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే మాణిక్‌రావు శుక్రవారం శంకుస్థాపన చేశారు. భవనాన్ని మంజూరు చేసినందుకు మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే మాణిక్‌రావుకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవీప్రసాద్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు నర్సింహులు, సర్పంచ్ వెంకట్‌రామ్‌రెడ్డి, నేతలు సుభాశ్‌రెడ్డి, ఆనంద్, జావీద్, కలీం, వహీద్ ఉన్నారు.

## నేడు మండలంలో ఎమ్మెల్యే పర్యటన

■ కంగ్టి, అక్టోబర్ 6 : మండలంలో శనివారం ఆయాగ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటించి అభివృద్ధి పనులను ప్రారంభిస్తారని ఎంపీపీ సంగీతావెంకట్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు గంగారం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తడ్కల్, చాప్టా(కె), చాప్టా(బీ), ఎడ్లరేగడితాండ, జమ్గి(కె), జమ్గి(బీ), సాధుతాండ, ఘన్‌పూర్, గాంధీనగర్, ముర్కుంజాల్, రాసోల్, బాన్సువాడ, దామరిగిద్ద గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటిస్తారని వివరించారు.

## డీపీవోకు వార్డు సభ్యుల వివరణ

■ జిన్నారం, అక్టోబర్ 6 : గడ్డపోతారం గ్రామ పంచాయతీలో అనుమతులు లేకుండా వెంచర్ ఏర్పాటు, ఖాళీ స్థలాలకు ఇంటి నెంబర్లు కేటాయింపుపై పీఆర్‌ఈవో నరేశ్‌బాబును సస్పెండ్ చేస్తూ, సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులకు షోకాజ్ నోటీసు జారీ చేసిన విషయం తెలిసిందే. నోటీసులపై డీపీవో సురేశ్ మోహన్‌ను శుక్రవారం వార్డు సభ్యులు వివరణ ఇచ్చారు.

## రైతులను ఇబ్బంది పెట్టొద్దు

■ జిన్నారం, అక్టోబర్ 6 : జిన్నారంలోని సర్వేనంబర్ 1లోని సుమారు 420 ఎకరాల అసైన్డ్ భూమిని హెచ్‌ఎండీఏ, టీఎస్ ఐఐసీ తీసుకుంటున్నాయని, కాగా, బలవంతంగా భూములు తీసుకోవద్దని పలువురు రైతులు తహసీల్దార్ రవికుమార్‌ను కోరారు. మాజీ ఎంపీటీసీ పుట్టి భాస్కర్ ఆధ్వర్యంలో రైతులు తహసీల్దార్‌ను శుక్రవారం కలిసి వినతిపత్రాన్ని అందజేశారు.

## ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాల కమిటీ

■ సంగారెడ్డి కలెక్టరేట్, అక్టోబర్ 6 : ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాల జిల్లా కమిటీని శుక్రవారం సెయింట్ ఆంథోనీస్ పాఠశాలలో తెలంగాణ రాష్ట్ర స్కూల్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శంకర్‌రావు, ప్రధాన కార్యదర్శి మధుసూదన్ సమక్షంలో ఎన్నుకున్నారు. జిల్లా గౌరవాధ్యక్షుడిగా ప్రశాంత్ కుమార్, అధ్యక్షుడిగా వెంకటేశం, ప్రధాన కార్యదర్శిగా ఆంథోనీరెడ్డి, కోశాధికారి నాగేశ్వర్‌రావు, ఉపాధ్యక్షులు గా విఠల్, విష్ణువర్ధన్‌రెడ్డి, రామకృష్ణ, సంయుక్త కార్యదర్శులుగా జగన్‌రెడ్డి, సతీశ్‌కుమార్, కిరణ్, కార్యనిర్వాహక కార్యదర్శులుగా నాగిరెడ్డి, ప్రమోద్, వర్కింగ్ ప్రెసిడెంట్లుగా ఆంథోనీరెడ్డి, శ్రీశైలం, జగన్ మోహన్, ప్రభు, రాష్ట్ర సభ్యులుగా మహిపాల్‌రెడ్డి, వనజారెడ్డి, ప్రధాన సలహాదారుడిగా లింగాగౌడ్‌ని ఎన్నుకున్నారు.



అందోల్ : జోగిపేటలో విద్యార్థులతో కలిసి అల్పాహారం తింటున్న ఎమ్మెల్యే క్రాంతికిరణ్



రామచంద్రాపురం : తెల్లాపూర్‌లో విద్యార్థులతో కలిసి అల్పాహారం చేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

# విద్యార్థులకు అల్పాహారం

- ■ విద్యారంగం బలోపేతానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం చారిత్రక నిర్ణయం
- ■ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉదయం వేళ అల్పాహారం అందజేత
- ■ జోగిపేటలో కేసీఆర్ అల్పాహారాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్
- ■ విద్యార్థులకు స్వయంగా వడ్డించిన ఎమ్మెల్యే
- ■ విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు
- ■ ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

అందోల్/ రామచంద్రాపురం/ నారాయణఖేడ్, అక్టోబర్ 6 : సీఎం కేసీఆర్ సంకల్పంతో రాష్ట్రవ్యాప్తంగా అన్ని సర్కారు బడుల్లో కార్పొరేట్ స్థాయిలో విద్యార్థులకు నాణ్యమైన విద్య, రుచికరమైన పౌష్టికహారం అందుతున్నదని ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ అన్నారు. ఏ ఒక్క పిల్లాడు పౌష్టికహార లోపంతో బాధపడకూడదని ఖర్చుకు వెనకాడకుండా మధ్యాహ్న భోజనం అందిస్తున్న ప్రభుత్వం ఇప్పుడు ఉదయం అల్పాహారాన్ని అందిస్తున్నదని చెప్పారు. శుక్రవారం జోగిపేట ప్రభుత్వ పాఠశాలలో కేసీఆర్ అల్పాహారం పథకాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే విద్యార్థులకు స్వయంగా వడ్డించి, వారితో పాటు అల్పాహారాన్ని తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'మనఊరు– మనబడి' ద్వారా పాఠశాలల రూపురేఖలు మారాయన్నారు. గ్రామాల్లో సైతం ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ స్థాయిలో కనిపిస్తున్నాయన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు క్రమశిక్షణతోపాటు టిఫిన్, భోజనం ఇస్తుండడంతో ఏ విద్యార్థి పస్తులు ఉండే పరిస్థితే లేదన్నారు. ఉదయం బడికి వచ్చిన విద్యార్థికి టిఫిన్, మధ్యాహ్నం భోజనం ప్రభుత్వం కలిస్తున్నదని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, జడ్పీ సీఈవో ఎల్లయ్య, మున్సిపల్ చైర్మన్ మల్లయ్య, వైస్ చైర్మన్ ప్రవీణ్, కమిషనర్ తిరుపతి, ఎంపీపీ బాలయ్య, వైస్ ఎంపీపీ మహేశ్వర్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ మల్లికార్జున్ మున్సిపల్ కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

**తెల్లాపూర్ జడ్పీహెచ్‌ఎస్‌లో అల్పాహారం**

రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో విప్లవాత్మకమైన మార్పులను తీసుకువస్తుందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. తెల్లాపూర్‌లోని జడ్పీహెచ్‌ఎస్‌లో మున్సిపల్ చైర్‌పర్సన్ లలితాసోమిరెడ్డితో కలిసి ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అల్పాహారం పథకాన్ని ప్రారంభించారు. అనంతరం విద్యార్థులతో కలిసి అల్పాహారం చేశారు. విద్యా వ్యవస్థలో సీఎం కేసీఆర్ సమూలమైన మార్పులు తెస్తున్నారన్నారు. పటాన్‌చెరు నియోజకవర్గంలోని 158 పాఠశాలల్లో 25,861మంది విద్యార్థులకు అల్పాహారం అందజేస్తామన్నారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ రాములుగౌడ్, కమిషనర్ శ్రీనివాస్, ప్రిన్సిపాల్ రమాదేవి, కౌన్సిలర్లు, నాయకులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

**ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడమే లక్ష్యం**

**- 'ఖేడ్' మున్సిపల్ చైర్‌పర్సన్ రుబీనాబేగం నజీబ్**

ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని నారాయణఖేడ్ మున్సిపల్ చైర్‌పర్సన్ రుబీనాబేగం నజీబ్ అన్నారు. నారాయణఖేడ్ పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో సీఎం అల్పాహార పథకాన్ని ప్రారంభించారు. విద్యార్థులు శ్రద్ధగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆర్డీవో వెంకటేశం, జడ్పీటీసీ లక్ష్మీబాయిరవీందర్‌నాయక్, తహసీల్దార్ దేవదాస్, సీడీపీవో సుజాత పాల్గొన్నారు.



నారాయణఖేడ్ పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు అల్పాహారం వడ్డిస్తున్న నాయకులు



అందోల్ : జోగిపేటలో విద్యార్థులకు అల్పహారాన్ని వడ్డిస్తున్న ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్



రామచంద్రాపురం : తెల్లాపూర్‌లో అల్పాహారం వడ్డిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

# ధీరత్వానికి ప్రతీక ఛత్రపతి శివాజీ

- ■ ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి
- ■ శివాజీ పరిపాలన, వ్యక్తిత్వం ఆదర్శం
- ■ నల్తూరులో శివాజీ మహారాజ్ విగ్రహావిష్కరణ



సిర్గాపూర్ : జీవులానాయక్‌తండాలో రాంరావు మహారాజ్ విగ్రహావిర్కణ సందర్భంగా ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డిని సన్మానిస్తున్న సర్పంచ్, స్థానికులు

జిన్నారం/ సిర్గాపూర్, అక్టోబర్ 6 : ఛత్రపతి శివాజీ మహారాజ్ ధీరత్వానికి, సుపరిపాలనకు ప్రతీక అని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. జిన్నారం మండలంలోని నల్తూరు గ్రామంలో శివాజీ మహారాజ్ విగ్రహాన్ని గురువారం రాత్రి ప్రజాప్రతినిధులతో కలిసి ఆవిష్కరించారు. విగ్రహావిష్కరణకు కళాకారుడు బిత్తిరి సత్తి అలియాస్ కావలి రవికుమార్ హాజరై గ్రామస్తులను తనదైన మాటలతో అలరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ భవిష్యత్ తరాలకు ఛత్రపతి శివాజీ చరిత్ర తెలియజేయాలన్న సమున్నత లక్ష్యంతో నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని పట్టణాలు, గ్రామాల్లో విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. శివాజీ రాజ్యపాలన విధానాలు, వ్యక్తిత్వం, యుద్ధనీతి, రాజనీతి, ధర్మాన్ని పరిరక్షించిన తీరు నేటి తరాలకు ఆదర్శనీయమన్నారు. విగ్రహావిష్కరణకు బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు రాజేశ్, జడ్పీవైస్ చైర్మన్ ప్రభాకర్, జిల్లా నాయకుడు వెంకటేశంగౌడ్, సరంచ్‌లు జనార్దన్, ప్రకాశం చారి, చెట్టి శివరాజ్, ఆంజనేయులు, చిట్ల సత్యనారాయణ, మాజీ సర్పంచ్ సురేందర్‌గౌడ్, నాయకులు బత్తుల మహేశ్, బేలా కృష్ణ, భీమ్‌రావు, మహేశ్, నరేశ్ పాల్గొన్నారు.



జిన్నారం : నల్తూరులో శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

**రాంరావు మహారాజ్ విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి**

సిర్గాపూర్, అక్టోబర్ 6 : మండలంలోని జెమ్లాతండా పంచాయతీ జీవులానాయక్‌తండాలో సంత్ రాంరావు మహారాజ్ విగ్రహన్ని నారాయణఖేడ్ ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి , గిరిజనుల గురువు ప్రేమ్‌సింగ్ మహారాజ్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ దివ్యభారతీచరణ్, ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.